ప్రజల మాట ప్రగతి బాట

కరీంనగర్ నియోజకవర్గం

# నామినేషన్ పత్రాలు క్షుణ్ణంగా పరిశీలించాలి

- జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ పమేలా సత్పతి
- నామినేషన్ల ప్రక్రియ పరిశీలన



నామినేషన్ల ప్రక్రియను పరిశీలిస్తున్న కలెక్టర్ పమేలా సత్పతి

కలెక్టరేట్, నవంబర్ 3: నామినేషన్ పత్రాలు క్షుణ్ణంగా పరిశీలించాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ పమేలా సత్పతి అధికారులకు సూచించారు. కరీంనగర్ అసెంబ్లీ స్థానానికి సంబంధించి రిటర్నింగ్ అధికారి కార్యాలయంలో కొనసాగుతున్న నామినేషన్ల ప్రక్రియను శుక్రవారం ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, నామినేషన్ దాఖలు చేసేందుకు వచ్చే అభ్యర్థులకు నామినేషన్ పత్రాలు 2బీలను రిటర్నింగ్ కార్యాలయం వద్ద ఉచితంగా అందించాలని సూచించారు. నియోజకవర్గానికి సంబంధించిన ఓటరు జాబితాలను అభ్యర్థులు పరిశీలించుకునేందుకు వీలుగా పోలింగ్ కేంద్రం వారీగా అందుబాటులో ఉంచాలని ఆదేశించారు. అలాగే, ఆన్‌లైన్‌లో కూడా పరిశీలించుకునేందుకు అవసరమైన ఏర్పాట్లు చేయాలన్నారు. నామినేషన్ పత్రాల నమోదులో అభ్యర్థులకు సిబ్బంది సహకరించి ప్రతి కాలంలో నమోదు చేసేలా చూడాలన్నారు. ఏదైనా కాలంలో చెప్పాల్సిందేమి లేనప్పుడు లేదు/వర్తించదు అని ఖచ్చితంగా రాసేలా చూడాలన్నారు. సెక్యూరిటీ డిపాజిట్ అనంతరం రిటర్నింగ్ అధికారికి అభ్యర్థి నామినేషన్ పత్రాలను సమర్పించినప్పుడు అనెగ్జర్-19, ఫార్మాట్-26 అఫిడవిట్, బ్యాంక్ ఖాతా, కుల ధ్రువీకరణ, ఫొటోలు, ఇతర నియోజకవర్గానికి చెందిన వారైతే వారి ఓటు వివరాలు తెలిపే సర్టిఫైడ్ కాపీ, అభ్యర్థి పోటీ చేసే పార్టీ గుర్తులను తెలియజేయాలని సూచించారు. నామినేషన్ స్వీకరణ అనంతరం స్క్రూటినీకి సంబంధించిన సమయాన్ని అభ్యర్థులకు తెలియజేయాలన్నారు. అనంతరం కార్యాలయంలో ఏర్పాటు చేసిన పలు విభాగాలను పరిశీలించారు. నామినేషన్ నాటి నుంచి అభ్యర్థుల ఖర్చులను రికార్డుల్లో నమోదు చేయాలని, వీటి నిర్వహణ ఎన్నికలు ముగిసే వరకు కొనసాగించాలన్నారు. అభ్యర్థుల ఖర్చుల వివరాలు పార్టీ పేరుతో ఏర్పాటు చేసిన రిజిస్టర్‌లో, ఇండిపెండెంట్ అభ్యర్థులకు సంబంధించిన ఖర్చులు షాడో రిజిస్టర్‌లో నమోదు చేయాలని స్పష్టం చేశారు. కార్యక్రమంలో సీపీ అభిషేక్ మహంతి, రిటర్నింగ్ అధికారి మహేశ్వర్, అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారులు, ఎన్నికల సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న బార్ అసోసియేషన్ ప్రతినిధులు

## పోస్టర్ ఆవిష్కరణ

కోర్టుచౌరస్తా, నవంబర్ 3: తెలంగాణలో న్యాయ వ్యవస్థ ప్రగతి పథంపై శనివారం హైదరాబాద్‌లోని జల విహార్‌లో నిర్వహించే రాష్ట్ర న్యాయవాదుల ఆత్మీయ సమ్మేళనం కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్‌ను బార్ అసోసియేషన్ మాజీ అధ్యక్షుడు పీవీ రాజ్‌కుమార్ ఆధ్వర్యంలో శుక్రవారం జిల్లా కోర్టు ఆవరణలో న్యాయవాదులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రాజ్‌కుమార్ మాట్లాడుతూ, ఆత్మీయ సమ్మేళనం కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, మాజీ ఎంపీ బోయినపల్లి వినోద్‌కుమార్, అంబర్‌పేట ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్ హాజరవుతారని పేర్కొన్నారు. ఉమ్మడి జిల్లాలోని న్యాయవాదులు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో బీఆర్‌ఎస్ సీనియర్ నాయకులు బండ గోపాల్ రెడ్డి, ప్రభాకర్ రావు, రాంరెడ్డి, రమేశ్, ప్రతాప్, మురళీధర్, బొజ్జ స్వామి, కే లక్ష్మయ్య,ఆంజనేయులు, తిరుపతి పాల్గొన్నారు.

## ఏడుగురిపై మాల్ ప్రాక్టీస్ కేసు

కమాన్‌చౌరస్తా, నవంబర్ 3: శాతవాహన యూనివర్సిటీ పరిధిలో నిర్వహిస్తున్న డిగ్రీ 5వ సెమిస్టర్ పరీక్షల్లో ఏడుగురిపై మాల్ ప్రాక్టీస్ కేసు నమోదు చేసినట్లు పరీక్షల నియంత్రణాధికారి డాక్టర్ శ్రీరంగ ప్రసాద్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఇందులో భాగంగా, కరీంనగర్ జిల్లా కేంద్రంలోని వాణీనికేతన్ డిగ్రీ కళాశాలలో ఇద్దరు, ఎస్‌ఆర్‌ఎం డిగ్రీ కళాశాలలో ముగ్గురు, శివాణి డిగ్రీ కళాశాలలో ఒకరు, వాగీశ్వరి డిగ్రీ కళాశాలలో ఒకరు మాల్ ప్రాక్టీస్‌కు పాల్పడుతూ పట్టుబడినట్లు వివరించారు.

## బీఈడీ ఫలితాల విడుదల

కమాన్‌చౌరస్తా, నవంబర్ 3 : శాతవాహన యూనివర్సిటీ పరిధిలో బీఈడీ 2, 4వ సెమిస్టర్ ఫలితాలు విడుదల చేసినట్లు పరీక్షల నియంత్రణాధికారి డాక్టర్ శ్రీరంగ ప్రసాద్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఫలితాల కోసం విద్యార్థులు యూనివర్సిటీ వెబ్‌సైట్‌లో చూసుకోవాలని సూచించారు.

## వలంటీర్లకు అవగాహన

కమాన్‌చౌరస్తా, నవంబర్ 3: జాతీయ నిఘా వారోత్సవాల్లో భాగంగా జిల్లా కేంద్రంలోని ఎస్సారార్ కళాశాలలో ఎన్‌ఎస్‌ఎస్, ఎల్‌ఐసీ సంయుక్త ఆధ్వర్యంలో అవినీతి వ్యతిరేకతపై ఎన్‌ఎస్‌ఎస్ వలంటీర్లకు శుక్రవారం అవగాహన కల్పించారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కే రామకృష్ణ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఎల్‌ఐసీ అధికారులు వీవీ నారాయణ, సంపత్ రెడ్డి, పెనుగొండ బసవేశ్వర్, విజయలక్ష్మి, ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రాం అధికారులు డాక్టర్ వీ వరప్రసాద్, డీడీ నాయుడు, సురేశ్‌కుమార్, చంద్రమౌళి, డాక్టర్ శారద, వలంటీర్లు తదితరులు పాల్గొన్నారు.

## మార్చిలో 'పది' పరీక్షలు

కమాన్‌చౌరస్తా, నవంబర్ 3: పదో తరగతి పబ్లిక్ పరీక్షలు మార్చి-2024 లో జరుగనుండగా, ఫీజు చెల్లించేందుకు ఈనెల 17వ తేదీ ఆఖరు అని జిల్లా విద్యాశాఖ అధికారి సీహెచ్ వీఎస్ జనార్దన్ రావు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ నెల 17 వరకు ఎలాంటి అపరాధ రుసుము లేకుండా ఫీజు చెల్లించవచ్చని, రూ. 50 అపరాధ రుసుముతో డిసెంబర్ ఒకటి వరకు, రూ. 200తో డిసెంబర్ 11 వరకు, రూ. 500తో డిసెంబర్ 20 వరకు ఫీజు చెల్లించే అవకాశం ఉన్నట్లు పేర్కొన్నారు. రెగ్యులర్ విద్యార్థులకు రూ. 125 మాత్రమే ఫీజు ఉంటుందని, మూడు సబ్జెక్టులు అంతకంటే తక్కువ సబ్జెక్టుల్లో ఫెయిల్ అయిన అభ్యర్థులకు రూ.110 ఫీజు ఉంటుందని వివరించారు. మూడు కంటే ఎక్కువ సబ్జెక్టులు ఫెయిలైన వారికి ఫీజు రూ. 125 ఉంటుందని, రెగ్యులర్ ఒకేషనల్ విద్యార్థులు అదనంగా రూ. 60 చెల్లించాల్సి ఉంటుందని తెలిపారు. విద్యార్థులు పరీక్ష ఫీజు వారు చదువుతున్న పాఠశాల ప్రధానోపాధ్యాయులకు చెల్లించాలని సూచించారు. మొదటి సారి పరీక్షకు ఎస్సీ, ఎస్టీ, బీసీ విద్యార్థుల తల్లిదండ్రులు గ్రామీణ ప్రాంతాల్లో రూ. 20 వేలలోపు, పట్టణ ప్రాంతాల్లో రూ. 24 వేలలోపు ఆదాయం ఉంటే ఆదాయ ధ్రువీకరణ పత్రం సమర్పిస్తే ఫీజు మినహాయింపు ఉంటుందని పేర్కొన్నారు.

## యజ్ఞవరాహ క్షేత్రంలో ప్రత్యేక పూజలు

కమాన్‌చౌరస్తా, నవంబర్ 3: నగరంలోని యజ్ఞవరాహస్వామి ఆలయంలో 37వ వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా శుక్రవారం ప్రత్యేక పూజలు, హోమం చేశారు. రాత్రి గజవాహనంపై శ్రీవారు ఆలయ మాడ వీధుల్లో విహరిస్తూ భక్తులకు దర్శనమిస్తూ కనువిందు చేశారు. సర్వవైదిక సంస్థానం ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ శ్రీభాష్యం వరప్రసాద్, సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.



స్వామి వారికి పూజలు చేస్తున్న భక్తులు



చెర్లభూత్కూర్‌లో ప్రచారం చేస్తున్నగంగుల కమలాకర్ సతీమణి రజిత, తదితరులు

# అర్హులందరికీ సంక్షేమ పథకాలు

కరీంనగర్ రూరల్, నవంబర్ 3: రాష్ట్రంలో అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందుతున్నాయని బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి, మంత్రి గంగుల కమలాకర్ సతీమణి రజిత పేర్కొన్నారు. చెర్లభూత్కూర్ గ్రామంలో శుక్రవారం ఆమె ప్రచారం చేశారు. అలాగే, గంగుల కమలాకర్ సోదరుడు సుధాకర్‌తో పాటు ఆయన సతీమణి గ్రామస్తులతో కలిసి ఇంటింటా ప్రచారం చేశారు. ఈ సందర్భంగా గంగుల రజిత మాట్లాడుతూ, కారు గుర్తుకే ఓటు వేయాలని కోరారు. సర్పంచ్ దబ్బెట రమణారెడ్డి, ఎంపీటీసీ బుర్ర తిరుపతి గౌడ్, సింగిల్ విండో చైర్మన్ పెండ్యాల శ్యాంసుందర్ రెడ్డి, బీఆర్‌ఎస్ గ్రామాధ్యక్షుడు కూర శ్యాంసుందర్ రెడ్డి, దాది సుధాకర్, గంగుల సుధాకర్, మాజీ జడ్పీటీసీ సాహితి కుమారి, సుజాత, అనితాకుమారి, పంది తిరుపతియాదవ్, పరశురాములు గౌడ్, తిరుపతి, నరేశ్‌రెడ్డి, సుజాత, రాజ్యలక్ష్మి, రమేశ్, పంది సంపత్‌కుమార్‌యాదవ్, తిరుపతి, మధు, మహేశ్, సతీశ్, నారాయణ, పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

# విద్యార్థులు యువ పరిశోధకులుగా ఎదగాలి




మాట్లాడుతున్న అసిస్టెంట్ ప్రొఫెసర్ సుహాసిని

కమాన్‌చౌరస్తా, నవంబర్ 3: విద్యార్థులంతా యువ పరిశోధకులుగా ఎదగాలని పింగళి ప్రభుత్వ డిగ్రీ కళాశాల అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ జీ సుహాసిని పిలుపునిచ్చారు. జిల్లా కేంద్రంలోని ఎస్సారార్ కళాశాలలో కరీంనగర్, జిజ్ఞాస, రీసర్చ్ కమిటీ ఆధ్వర్యంలో స్టూడెంట్ స్టడీ ప్రాజెక్ట్‌పై శుక్రవారం కార్యశాల నిర్వహించారు. ఈ కార్యక్రమానికి రీసోర్స్ పర్సన్‌గా హాజరైన సుహాసిని మాట్లాడుతూ, విద్యార్థులు నేటి నుంచే మన చుట్టూ ఉన్న సమస్యలను క్షుణ్ణంగా అర్థం చేసుకొని, నూతన ఆలోచనలతో పరిశోధనలు సాగించి వాటి పరిష్కారానికి తమ వంతు కృషి చేయాలని సూచించారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కే రామకృష్ణ మాట్లాడుతూ, పరిశోధనలు మన నిత్య జీవితంలో భాగం కావాలని పిలుపునిచ్చారు. కళాశాల జిజ్ఞాస కో-ఆర్డినేటర్ డాక్టర్ కే భాస్కర్ మాట్లాడుతూ, విద్యార్థులు ఈ జిజ్ఞాస వేదికను సద్వినియోగం చేసుకొని అధ్యాపకుల సహాయంతో స్టూడెంట్ స్టడీ ప్రాజెక్ట్‌లు చేసి కళాశాలలో సమర్పించాలని కోరారు. వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ రాజయ్య, డాక్టర్ ప్రమోద్, రీసెర్చ్ కో ఆర్డినేటర్ డాక్టర్ మల్లారెడ్డి, స్టాఫ్ క్లబ్ సెక్రటరీ డాక్టర్ ఏ శ్రీనివాస్, జీ శ్రీనివాస్, పీ రాజు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# ఒలింపియాడ్ పరీక్షలో శ్రీ చైతన్య విద్యార్థుల సత్తా



ప్రతిభ కనబర్చిన విద్యార్థులతో ప్రిన్సిపాల్ తదితరులు

కమాన్‌చౌరస్తా, నవంబర్ 3: జిల్లా కేంద్రంలోని బోయవాడ శ్రీ చైతన్య పాఠశాల విద్యార్థులు క్యాట్ లెవెల్-1 పరీక్షలో ఉత్తీర్ణులై సత్తా చాటారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ పద్మజ మాట్లాడుతూ, క్యాట్ లెవెల్-1 ఫలితాల్లో మ్యాథ్స్ విభాగంలో 27 మంది, ఫిజిక్స్ విభాగంలో 17 మంది, కెమిస్ట్రీ విభాగంలో 19 మంది ఉత్తీర్ణులైనట్లు పేర్కొన్నారు. పాఠశాలల డీజీఎం లక్ష్మణ్ రావు, ఆర్‌ఐ రాజు, కోఆర్డినేటర్ ప్రవీణ్, డీన్ సునీల్‌కాంత్, సీ బ్యాచ్ ఇన్‌చార్జి మహేశ్, ఒలింపియాడ్ ఇన్‌చార్జి సతీశ్, ఏవో మనోహర్ రెడ్డి, పీఈటీ శ్రీకాంత్ పాల్గొన్నారు.

## రేపు కవి సమ్మేళనం

కమాన్‌చౌరస్తా, నవంబర్ 3: నగరంలోని ఫిలింభవన్‌లో ఆదివారం ఉదయం 9 నుంచి సాయంత్రం 5 గంటల వరకు జాతీయ స్థాయి కవి సమ్మేళనాన్ని భవానీ సాహిత్య వేదిక ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నట్లు వేదిక వ్యవస్థాపక అధ్యక్షుడు వైరాగ్యం ప్రభాకర్, బాధ్యుడు నూజెట్టి రవీంద్రనాథ్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. భాషా సాంస్కృతిక మండలి వ్యవస్థాపక అధ్యక్షుడు డాక్టర్ గంట జలేందర్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై సమ్మేళనాన్ని ప్రారంభిస్తారని పేర్కొన్నారు. నగరంలోని కవిత్వ సృజనకారులు హాజరై విజయవంతం చేయాలని కోరారు.